జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



మంగళవారం | 25-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 764 పేజీలు: 4 వెల : రూ.7




## సూర్యనారాయణస్వామి దేవస్థానంలో..

# మహాపచారం



- స్వామి వారికి లడ్డూ, పులిహోరా నైవేద్యంగా ఇవ్వడం లేదన్న విమర్శలు
- నైవేద్యం కాకుండానే భక్తులకు విక్రయిస్తున్న ప్రసాదం
- అన్న ప్రసాదంలోనూ నైవేద్యం కలుపకుండానే పంపిణీ
- భక్తుల మనోభావాలతో ఆటలాడుకుంటున్నారని విమర్శలు
- సంస్కృతి, సంప్రదాయాలను మంటగలుపుతున్న కొందరు అర్చకులు, అధికారులు
- ఆలయ అర్చకులు, అధికారుల మధ్య సమన్వయ లోపం
- మహా ప్రసాదం విషయమై కొందరు అర్చకుల్లో అసంతృప్తి
- దేవస్థానం ఉన్నతాధికారులు, రాష్ట్ర, కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్న కొందరు అధికారులు, అర్చకులు




శ్రీకాకుళం, ఆగస్టు 24 (వార్త): ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానంలో మహాపచారం జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. దేవస్థానంలో మూలవిరాట్‌కు లడ్డూ, పులిహోరాను నైవేద్యంగా సమర్పించిన అనంతరం భక్తులకు విక్రయించాల్సివుంది. అలాగే ఆలయ ఆవరణలోని అన్న ప్రసాద మండపంలో భక్తులకు వడ్డించే ఆహారంలో స్వామి వారికి పెట్టిన నైవేద్యాన్ని కలిపిన తర్వాతే వడ్డించాల్సివుంది. అయితే సూర్యనారాయణస్వామి దేవస్థానంలో మాత్రం అటువంటిదేమీ జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. నిత్యం అరసవల్లి దేవస్థానం వంట శాలలో పెద్ద ఎత్తున పులిహోరా, లడ్డూలను తయారు చేస్తారు. వీటిని భక్తులకు విక్రయిస్తారు. ఆదివారం రోజున పెద్ద ఎత్తున భక్తులు ఈ మహాప్రసాదం కోసం క్యూలైన్లలో పడిగాపులు కాస్తుంటారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు. ఆదివారం రోజున ఉత్తరాంధ్రవాసులే కాకుండా ఒడిశా నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తారు. వారంతా అన్న ప్రసాద మండపంలో అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తారు. అలాగే లడ్డూ, పులిహోరాను కళ్లకు అద్దుకుని తీసుకుని తమ తమ ఇళ్లకు తీసుకువెళ్లి ఈ ప్రసాదాన్ని పంచిపెడుతుంటారు. అలాంటిది అరసవల్లి దేవస్థానంలో తయారయ్యే లడ్డూ, పులిహోరాను స్వామి వారికి భోగం పెట్టకుండా విక్రయాలు జరుపుతుండడం పట్ల ఆలయ సిబ్బంది, అర్చకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ లడ్డూ, పులిహోరాను స్వామి వారికి భోగం పెట్టిన తర్వాతనే ప్రసాదమవుతుంది. అయితే ఇటీవల ఆదిత్యుని సన్నిధానంలో అటువంటిదేమీ జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

## అధికారులు, అర్చకుల మధ్య సమన్వయ లోపం..

అరసవల్లి దేవస్థానం, అర్చకుల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఇటువంటివి జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా వారి మధ్య సయోధ్య లేకపోవడం, నూతన పాలకమండలి ఇంకా ప్రమాణ స్వీకారం చేయకపోవడంతో ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అడిగేవారు లేకపోవడంతో కొందరు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే దేవస్థానంలో అనేక అవకతవకలు జరగడంపై పత్రికల్లో వరుస కథనాలు వస్తుండడంతో ఆలయ ప్రతిష్ట మంటగలచిన విషయం తెలిసిందే.

## అన్న ప్రసాద వంటల తయారీపైనే విమర్శలు

అరసవల్లి దేవస్థానంలో అన్నప్రసాదంతో పాటు పులిహోరా, లడ్డూల తయారీ విషయంలోనూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వంటల తయారీకి బ్రాహ్మణులను నియమించాల్సివుండగా, ఇతర కులాల వారు వంటలు తయారీ చేస్తున్న విషయమై ఆలయ అర్చకులు, అధికారుల మధ్య వివాదం నెలకొంది. నైవేద్యం కాకుండానే భక్తులకు ప్రసాదం విక్రయంపై భక్తులు మండిపడుతున్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. సంస్కృతి, సంప్రదాయాలను కొందరు మంటగలుపుతున్నారన్న అపవాదు కూడా ఉంది. ఆలయంలో జరుగుతున్న అపచారంపై కొందరు దేవదాయ శాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు భక్తులు సన్నద్ధమవుతున్నారు. అలాగే శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

* యాదవులపైనే ప్రధాన గురి
* రెండో స్థానంలో మైనార్టీలు వైపు మొగ్గు
* రెండు పార్టీలు బలనిరూపణకు సిద్ధం
* ఆశావహుల జాబితా కొండంత

# ఇరు పార్టీల కన్ను..
# కొత్త ముఖాలుపైనే..!






ఇచ్ఛాపురం, ఆగస్టు 24 (వార్త): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో ఈసారి ఎలాగైనా కొత్త అభ్యర్థిని బరిలోకి దింపాలని ఇరు పార్టీలు యోచిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా చైర్పర్సన్ స్థానం ప్రత్యక్ష పద్ధతి కావడంతో గతంలో పనిచేసిన చైర్పర్సన్ల కాకుండా కొత్త వ్యక్తులపై గురిపెడుతున్నట్లు సమాచారం. గతంలో పనిచేసిన అభ్యర్థులు అయితే వారిపై కొంత వ్యతిరేకత ఉంటుందని కొత్త ముఖాలపై ప్రజల్లోకి తీసుకు వెళ్తే పార్టీలు వారి మేనిఫెస్టోలను ప్రజలకు నమ్మే విధంగా వివరించవచ్చని భావిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి ఈసారి కొత్త వ్యక్తులపై అన్వేషణ జరుగుతోందని తెలుస్తుంది. ముఖ్యంగా యాదవులపై కన్నేసినట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీ పీఠాన్ని యాదవులకు అప్పగిస్తే వారికి సమతుల్య స్థానం లభించినట్లు ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటివరకు ఆరుసార్లు ఎన్నికలు జరగగా వీటిలో ఐదు సార్లు కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు మాత్రమే చైర్మన్ పీఠం అధిరోహించగా ఒకసారి మైనార్టీ, నాలుగు సార్లు రెడ్డిక సామాజిక వర్గం నుండి ఎన్నికయ్యారు. నాలుగు సార్లు కూడా ఒకే కుటుంబం నుండి ఒకే వంశం నుండి మున్సిపల్ పీఠం పరిపాలించడంతో మిగిలిన సామాజిక వర్గాలు మాకు కూడా అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నట్లు భావిస్తున్నారు. యాదవుల పట్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ఓ అడుగు ముందుకే ఉంటుంది. ఇప్పటికే ఎమ్మెల్సీ స్థానాన్ని ఆ పార్టీ నుండి ఆ సామాజిక వర్గం నేతకు దక్కింది. ఇక మున్సిపాలిటీలో ప్రధాన





సామాజిక వర్గాల్లో ఒకరైన యాదవులు ఈసారి పీఠం దక్కించుకోవాలని ఉవ్విలురుతున్నారని తెలుస్తోంది. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ యాదవులకు గత రెండు దశాబ్దాలుగా పార్టీ అధ్యక్ష పీఠం కట్టబెడుతూ వస్తుంది ఈసారి ఆ పార్టీ నుండి కూడా యాదవ్ సామాజిక వర్గం నుండి చైర్మన్ పీఠంపై ప్రధాన పోటీ ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కూడా దీటైన యాదవ సామాజిక వర్గం అభ్యర్థిని బరిలో దింపితే ఎలా ఉంటుందని భావిస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన తాడేపల్లిలో కేంద్ర కార్యాలయంలో స్థానిక సంస్థలు ఎన్నికలపై 175 నియోజకవర్గాల ఇన్చార్జిలతో సమావేశం మంగళవారం నిర్వాహిస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం కీలకంగా మారింది.

మరోవైపు రెండు ప్రధాన సామాజిక వర్గాలు కాదని భావిస్తే మైనార్టీలకు అవకాశం ఇవ్వాలని అన్వేషస్తున్నారు. మైనార్టీల నుండి దీటైన అభ్యర్థి ఎవరు ఉన్నారని జల్లెడ పడుతున్నారు. అంగ బలం, అర్థ బలం తోపాటు మంచితనం స్థానికంగా ఉన్న ప్రజలతో మమేకమై సేవా గుణం కలిగి ఉన్న వ్యక్తులను ఎటువంటి లాభాపేక్ష లేకుండా స్వార్థం లేకుండా మున్సిపాలిటీ ప్రజలకు సుపరిపాలన అందించే వ్యక్తులను ఆచితూచి మరి వెతుకుతున్నారు. మరోవైపు రెడ్డిక సామాజిక వర్గం కూడా తాము ఎప్పటికీ నియోజకవర్గంలో సింహ భాగం ఉన్నప్పటికీ కేవలం తమకు మండలానికి, మున్సిపాలిటీకి మాత్రమే పరిమితం చేస్తున్నారని ఎమ్మెల్యే టికెట్ అందని ద్రాక్షలా మారిపోతుందని మదన పడుతున్నారు. ఉన్న కాస్త మున్సిపల్ పీఠం కూడా దక్కకపోతే ఆ సామాజిక వర్గంలో మనోవేదన కి గురవుతారని భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నుండి కూడా యాదవ్ సామాజిక వర్గం నుండే పోటీ నెలకొనగా ఆ పార్టీ కూడా కొత్త ముఖాలను బరిలో దింపాలని భావిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ కుల సమీకరణ అంశం రాకపోతే మైనార్టీలపై కన్నేసినట్లు తెలుస్తోంది. ఎంతసేపు ఆ మూడు నాలుగు కులాలేనా? మిగిలిన కులాలకు రాజ్యాధికారం దక్కదా అంటూ ఆవేదన చెందుతున్నారు. ఈ నేపద్యంలో బలమైన దీటైన మైనార్టీ అభ్యర్థిని కూడా బరిలో దింపాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి నియోజకవర్గ కంచుకోటలో ఉన్న ఇచ్ఛాపురంలో కేవలం ఒక్కసారి మాత్రమే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గెలవగా అన్ని పర్యాయాలు తెలుగుదేశం ఎమ్మెల్యేలే గెలుపొందారు. ఇదే క్రమంలో మునిసిపాలిటీ విషయంలో ఒక్కసారి మాత్రమే తెలుగుదేశం గెలుపొందగా మిగిలిన అన్ని పర్యాయాలు కాంగ్రెస్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు చైర్మన్ పీఠం దక్కించుకున్నారు. ఇది కాస్త ఆ పార్టీకి పెద్ద సవాల్‌గా మారింది. మరో వైపు ఇరుకున పెట్టె అంశంగా మారింది. త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యేకు ఆమాత్య పీఠం దక్కాలంటే మున్సిపాలిటీలో తెలుగుదేశం పీఠం చేజిక్కించుకోవాల్సిన అవసరం భుజ స్కంధాలపై ఎంతైనా ఉంది. మొత్తం మీద ఇరు పార్టీలో యాదవుల పైన మరియు మైనార్టీల పైన గురిపెట్టడంతో ఏ పార్టీ నుండి ఎవరికి పదవి వరిస్తుందో వేచి చూడాలి.

## పీజీఆర్ఎస్‌కు 171 అర్జీలు

* గ్రీవెన్స్‌కు జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలి
* కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం, ఆగస్టు 24 (వార్త): జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ప్రజల నుంచి 171 వినతులు నమోదయ్యాయి. సాయంత్రం 6.50 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా అందిన ఈ ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు మాత్రమే హాజరు కావాలని, సెకండ్ లెవెల్ అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని తేల్చిచెప్పారు. ప్రజలు ఇచ్చే అర్జీలను స్వయంగా జిల్లా అధికారులే పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్‌కు అందిన మొత్తం 171 అర్జీల్లో అత్యధికంగా రెవెన్యూ (సీసీఎల్ఏ) శాఖకు సంబంధించి 88 వినతులు వచ్చాయి. పంచాయతీ రాజ్ శాఖకు 18, సర్వే సెటిల్మెంట్స్ మరియు ల్యాండ్ రికార్డ్స్ 9, సెర్ప్ 9, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 9, విద్యుత్ శాఖ 8, స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు 6, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ 4, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 3, సమగ్ర శిక్ష 3 చొప్పున అర్జీలు నమోదయ్యాయి. అదేవిధంగా ఏపీ ఎస్సీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, జలవనరులు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖలకు చెరో 2 చొప్పున వినతులు వచ్చాయి. గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, గ్రామీణాభివృద్ధి, ఏపీఎస్ఆర్టీసీ, హౌసింగ్ కార్పొరేషన్, పోలీసు, సివిల్ సప్లైస్, వ్యవసాయ శాఖ, మహిళా శిశు సంక్షేమం, టిడ్కో, మత్స్య శాఖ, ఆర్థిక శాఖలకు చెరో 1 చొప్పున అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి



ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, చట్ట పరిధిలో పరిష్కర చర్యలు చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్)లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా ఎస్పీ మొత్తం 56 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదు దారులతో మాట్లాడుతూ వారి నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి, ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమ స్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొ న్నారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని, నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి, చట్టపరమైన చర్యలు చేపట్టి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా జాప్యానికి తావు ఉండరాదని స్పష్టం చేశారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో నేరుగా ఫోన్‌లో ( జూమ్ కాన్ఫరెన్స్) ద్వారా మాట్లాడి, ఆయా ఫిర్యాదులు పై తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు పై నివేదిక రూపంలో పోలీసు కార్యాలయానికి సకాలంలో అందజేయాలని స్పష్టం చేశారు. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కుటుంబ వివాదాలు, పౌర సంబంధిత సమ స్యలు, ఆస్తి వివాదాలు, మోసపూరిత ఘటనలు, సైబర్ మోసాలు తదితర అంశాలను స్వీకరించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# వంశధార కాలువలోకి దూసుకెళ్లిన కారు..

# ఇద్దరి మృతి



- కిన్నెరవాడ సమీపంలో ఘోర ప్రమాదం
- ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి కాలువలోకి కారు
- డ్రైవర్ సురక్షితం.. - శ్రీపురం వాసులు రాము, విశాల్ మృతి

**సారవకోట, ఆగస్టు 24 (వార్త):** సారవకోట మండలం కిన్నెరవాడ గ్రామ సమీపంలో వంశధార ఎడమ కాలువలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రాణాలతో బయటపడగా, కారులో ఉన్న కోటబొమ్మాళి మండలం శ్రీపురం గ్రామానికి చెందిన పీసా రాము, ఆయన మేనల్లుడు విశాల్‌కుమార్ మృతి చెందినట్లు పోలీ సులు గుర్తించారు. అలుదు నుంచి బుడితి గ్రామం వైపు కారు వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించ బోయిన సమయంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయినట్లు తెలిసింది. దీంతో కారు ఒక్కసారిగా అదుపు తప్పి వంశధార ఎడమ కాలువలోకి దూసుకెళ్లి నీటిలో మునిగిపోయింది. ప్రమాద తీవ్రతకు కారులో ఉన్న



వారు బయటకు రాలేక పోయినట్లు సమాచారం. ప్రమాద సమయంలో డ్రైవర్ కారు అద్దాలు పగలగొట్టుకుని బయటకు రావడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. అనంతరం స్థానికులు అతడిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కారులో మరో ఇద్దరు చిక్కుకుపోయినట్లు సమాచారం అందడంతో స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఈ సమాచారం అందుకున్న సారవకోట పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు, సహాయక చర్యలను ముమ్మరం చేశారు. కాలువలో నీటి ప్రవాహం ఉండటంతో సహాయక చర్యలకు కొంత ఇబ్బంది ఎదురైన ప్పటికీ సిబ్బంది విస్తృతంగా గాలింపు చేపట్టారు. గల్లంతైన రాము, విశాల్‌కుమార్ మృతదేహాలను వెలికితీసేందుకు చర్యలు చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదా నికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషాద ఘటనతో శ్రీపురం గ్రామంలో విషాదఛాయలు అల ముకున్నాయి.

## బోన్‌మ్యారో బాధితునికి సాయం



**కంచిలి, ఆగస్టు 24 (వార్త):** బూరగాం గ్రామంలో బోన్ మ్యారో వ్యాధితో బాధపడుతున్న దూపాన మాధవరావు కుటుంబానికి కంచిలి రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్ల అసోసియేషన్ తరపున సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. లక్షలాది రూపాయల ఖర్చుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాధవరావు పరిస్థితిని గమనించిన వీరు రూ.27,116ల సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మీరు సహాయం పట్ల బాధిత కుటుంబం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## కేదారిపురంలో ఇంటింటికీ తెలుగుదేశం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 24 (వార్త):** కేదారిపురం పంచాయతీలో డోర్ టు డోర్ తెలుగుదేశం అనే కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు లోపింటి పద్మనాభం, గ్రామ టిడిపి సీనియర్ నాయకురాలు ఇన్చార్జ్ కూన అన్నపూర్ణ ఎర్రయ్యల ఆధ్వర్యంలో జరిగింది. బాలకృష్ణ పురం మాజీ సర్పంచ్ ప్రతినిధి బి లోహిదాసు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండేళ్ల కూటమి విజయాలను వివరించారు.

## కాలువలు ఇలా..నీరు పారేదెలా?

- అధ్వానంగా టీడీ వలస కాలువలు
- పట్టించుకోని అధికారులు



**జి.సిగడాం, ఆగస్టు 23 (వార్త):** టీడీ వలస గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ పిచ్చిమొక్కలు, పొదళ్లుతో అస్తవ్యస్తంగా మారింది. దీంతో మురుగునీటి కాలువల్లో నీరు పారలేక రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో రోడ్డంతా దుర్వాస వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. డ్రైనేజీ మురుగు వలన దోమలు ఈగలతో అనారోగ్యం పాలవుతున్నమని గతం సంవత్సరం ఇదే సమయానికి గ్రామంలో పారిశుధ్యం లోపంచడంతో ప్రజలు డయోరియా, అతిసార, విష జ్వరాలతో నానా ఇబ్బందులు పడ్డామని ఈ సారి కూడా గ్రామంలో జ్వరాలు భారిన పడితే గాని సంబదిత అదికారులు పట్టించుకోరా అని అవేదన చెందుతున్నారు. ఇంటి పన్ను కట్టించుకుంటున్నారు గాని పారిశుధ్య పనులు చేయరా అని విమర్శిలు వినిపిస్తున్నాయి. దీనిపై ప్రత్యేక అదికారులు, జిల్లా అదికారు స్పందించి డ్రైనేజీ పూడిక పనులు చర్యలు చేపట్టాలని కోరారుతున్నారు.

## ఇంటింటికి మన ప్రభుత్వం

**జి.సిగడాం, ఆగస్టు 23 (వార్త):** అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టిడిపి సీనియర్ నాయకులు మండల యూనిట్ ఇంచార్జ్ మాజీ సర్పంచ్ బోగాది అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం మధుఫాం గ్రామంలో రెండెళ్ల నమ్మకం అబివృద్ధి సంక్షేమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే, ఎంపీ చోరతో గ్రామనికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారని ఇప్పటి వరకు 50 శాతం పనులు చేశామన్నారు. సీసీ రోడ్డు, శ్మశాన వాటిక, మొదటి విడలలో రూ.14 లక్షలు,రెండు విడతలో రూ.18 లక్షలు నల్లి పేట గ్రామానికి 29. లక్షల 70000 వేల రూ. జలజీవన్ మిషన్ పనును త్వరి గతన పూర్తి చేస్తున్నామన్నారు. విద్యుత్ సదుపాయం కోసం 10 విద్యుత్ స్తంబాలు, జాక వారి వీధిలో మిని విద్యుత్ ట్రాన్స్ఫర్, ఎస్సీ కార్పోరేషన్ ద్వారా టిఫిన్ సెంటర్ కోసం రూ.1,00,000 లను,ఇటీవల గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.50,000 చెక్కును అందజేశామన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా బోర్లు మరమత్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగుతోందని తెలిపారు. దేశ అబివృద్ధి ప్రజా సంక్షేమం ప్రదాని నరేంద్ర మోదీ సాధ్యమని తెలిపారు. రాష్ట్ర అబివృద్ధి, సంక్షేమం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. గ్రామ స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో రాష్ట్రంలో ఎచ్చెర్ల నియోజకవర్గం అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా సాధ్యపడుతుందని వీరిద్దరు ప్రజా నాయకులని అన్నారు.





# ఉన్నారా..సార్!

- సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు
- కానరాని మండలఅధికారుల పర్యవేక్షణ
- ప్రత్యేక అధికారుల సమన్వయ పరిపాలన ఎక్కడ?

**జి.సిగడాం, ఆగస్టు 23 (వార్త):** మండలంలో పలువురు(కొత్త మంది) సచివాలయ ఉద్యోగాలు మండల అదికారులు మండల సిబ్బంది పరిస్థితి అడకత్తెరలో పోకచెక్క మాదిరిగా తయారైంది. కరవమంటే కప్పకు కోపం విడవ మంటే పాముకు కోపం అన్నట్టుగా విధులు ఉండడంతో నెట్టుకురావడం కష్టమవుతోందని అంటున్నారు. సచివాలయంలో పలువురు ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని వారు ఇష్టారాజ్యంగా వస్తూవెళుతున్నారని ప్రజలు చెప్పుకొస్తున్నారు. ఏదైన పనులపై గ్రామంలో ఉన్న సచివాలయాలకు వెలితే సంబదించిన అదికారులు ఉండకపోవడం విడ్డూరంగా ఉంది. రావడం వెళ్ళడం అంతా వారి ఇష్టానుసారాంగ మారింది. గ్రామ సచివాలయంలో ఎవరో ఇద్దరు లేదా ఒకరు ఉంటున్నారు. వారిని కూడా ఎక్కడ మీ సిబ్బంది అని అడిగితే ఇప్పుడే జిల్లా,మండల, సర్వేలకు వెళ్లారంటూ బదులిస్తున్నారు. పంచాయితీ కార్యదర్శులకు కూడా ఎటువంటి సమాచారం లేకుండా వెళ్లి పోతున్నారు. తీరా అయ్యా, అమ్మా ఎటు వెళ్లారు అని పంచాయితీ కార్యదర్శులు అడిగితే తిరిగి మేము కూడా మీలాంటి ఉద్యోగులమే, మాకు పనులుంటాయి చెప్పి వెళ్లడం కుదరదు అంటూ బదులిస్తున్నారు.దీనిపై మండల స్థాయి అధికారులు కూడా సరైన పర్యవేక్షణ లేక కాలక్షేపానికి ఏదో పర్యవేక్షణ చేశాములే అని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారం ఉంది. గ్రూపుల్లో పర్యవేక్షణ పోటోలే తప్ప ఎటువంటి ఉద్యోగ సమపాలన మార్పు కనబడటంలేదు. జిల్లా అదికారులు స్పందించి తగు చర్యలు తీసుకుంటారని ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

## బహిరంగ మల విసర్జనతో

# నౌపడలో నరకయాతన

- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రుల మధ్య దుర్వాసన
- ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి
- అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**సంతబొమ్మాళి, ఆగస్టు 23 (వార్త):** నౌపడ మేజర్ పంచాయతీలో బహిరంగ మలవిసర్జన సమస్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. నౌపడ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నుంచి స్టేట్ బ్యాంక్ వరకు రహదారికి ఇరువైపులా కొందరు వ్యక్తులు నిత్యం బహిరంగ మలవిసర్జన చేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు, స్థానిక ప్రజలు ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలోనే ఆంజనేయస్వామి ఆలయం, గ్రామదేవత ఆలయం, ప్రభుత్వ వైద్యశాల, పశువైద్యశాల, ప్రభుత్వ పాఠశాల, ప్రైవేటు పాఠశాల, చర్చి, వాటర్ ట్యాంక్, గ్రామ సచివాలయం, స్టేట్ బ్యాంక్ తదితర ముఖ్యమైన ప్రదేశాలు ఉన్నాయి. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ రహదారికి ఇరువైపులా మలవిసర్జన చేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారడమే కాకుండా ప్రజారోగ్యంపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మలవిసర్జనను నిర్మూలించేందుకు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛత కార్యక్రమాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతోపాటు అనేక కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు సహాయం అందించాయి. అయినప్పటికీ కొందరు ఇప్పటికీ బహిరంగ మలవిసర్జనకు పాల్పడుతుండటం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మలవిసర్జన వల్ల పరిసరాలు కలుషితమై అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉంటాయని, చిన్నారులు, వృద్ధులు, ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఆసుపత్రులు, పాఠశాలలు, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో ఇటువంటి పరిస్థితి కొనసాగడం బాధాకరమని అంటున్నారు. ఈ సమస్యపై గతంలో యువకులు, స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు చెబుతున్నారు. ప్రతిరోజూ ఈ ప్రాంతం మీదుగా సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ బహిరంగ మలవిసర్జనను అరికట్టేందుకు తగిన చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి నౌపడలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. బహిరంగ మలవిసర్జన వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, ప్రజలకు కలిగే ఇబ్బందులపై గ్రామంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే సమస్యాత్మక ప్రాంతాల్లో రాత్రివేళల్లో పర్యవేక్షణ చేపట్టి, బహిరంగ మలవిసర్జనకు పాల్పడుతున్న వారికి ముందుగా అవగాహన కల్పించి, నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆధునిక కాలంలోనూ నౌపడలో ముక్కులు మూసుకుని రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఎందుకు ఉండాలి? ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భద్రత, పరిసరాల పరిశుభ్రతను దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే కాదు.. నౌపడకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉందని, ఇకనైనా బహిరంగ మలవిసర్జనకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## విశ్వబంధుత్వ స్ఫూర్తితో మెగా రక్తదాన శిబిరం




**కొత్తూరు, ఆగస్టు 24(వార్త):** విశ్వబంధుత్వ దినోత్సవ సందర్భంగా స్థానిక కొత్తూరు పంచాయతీ లోని శివ దర్శన్ భవన్‌లో బ్రహ్మకుమారీస్ రాజయోగ విద్యాలయం ఆధ్వర్యంలో, రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లోతుగెడ్డ తులసి వరప్రసాద్ రావు, ఎస్సై వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లోతుగెడ్డ మాట్లాడుతూ, రక్తదానం మహాదానమని, ఒక వ్యక్తి ఇచ్చే రక్తం ఆపదలో ఉన్న పలువురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు.అనంతరం ఎస్సై కె వెంకటేష్ మాట్లాడుతూ, యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని కోరారు. రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా తానే స్వయంగా రక్తదాతగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. విశ్వబంధుత్వ స్ఫూర్తితో రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని ముఖ్య అతిథులు పేర్కొన్నారు. రక్తదానం ద్వారా సమాజానికి విలువైన సేవ అందిస్తున్న నిర్వాహకులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ లక్ష్మి నారాయణ నాయుడు, కోయిలాపు శ్రీనివాస్ రావు, పడాల వెంకట క్రిష్ణ, పెద్దిన అమర్, పొగిరి రవి, పడాల నాగభూషణం,బ్రహ్మకుమారీస్ సభ్యులు, యువత, స్వచ్ఛంద రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం సామాజిక సేవా స్ఫూర్తిని చాటిచెప్పింది.

## నూకరాజు కుటుంబ ఘటనపై

# సమగ్ర దర్యాప్తు చేయాలి

- సాదిక్‌ఖాన్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి
- కాశీబుగ్గ డీఎస్పీకి బీజేపీ నాయకుల ఫిర్యాదు

**పలాస, ఆగస్టు 24(వార్త):** రాజమహేంద్రవరంలో ఉద్యోగం చేస్తున్న ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు దారితీసిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, ఆరోపణలు ఎదుర్కొంటున్న సాదిక్‌ఖాన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలాస నియోజకవర్గ బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కాశీబుగ్గ డీఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. నూకరాజు కుటుంబసభ్యుల వాంగ్మూలాలు, ప్రజల్లోకి వచ్చిన సమాచారం, ప్రచురితమైన వార్తల ఆధారంగా సాదిక్‌ఖాన్‌పై పలు ఆరోపణలు ఉన్నాయని వారు తెలిపారు. మోసం, బెదిరింపులు, ఆర్థిక ఒత్తిడి, నగదు, బంగారం తీసుకోవడం, ప్రైవేట్ ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేయడం, కుటుంబసభ్యులను బెదిరించడం, ప్రాణహాని హెచ్చరికలు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై లోతైన విచారణ జరపాలని కోరారు. ఈ వ్యవహారంలో డిజిటల్ ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, ఫోన్ కాల్ వివరాలు, చాటింగ్ సమాచారం, సీసీటీవీ ఫుటేజీలు, ఆస్తి పత్రాలు తదితర ఆధారాలను సేకరించి వాస్తవాలను వెలికితీయాలని విజ్ఞప్తి చేశారు. దర్యాప్తులో ఎలాంటి రాజకీయ, సామాజిక, మతపరమైన ఒత్తిళ్లకు తావులేకుండా చట్టం ముందు అందరూ సమానమే అనే సూత్రంతో విచారణ సాగించాలని కోరారు. ఆరోపణలు రుజువైతే నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలాస రూరల్, అర్బన్ మండల బీజేపీ అధ్యక్షులు మామిడి ప్రసాదరావు, పొట్నూరు తారకేశ్వరరావు, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పాలవలస వైకుంఠరావు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్కోజు ధర్మారావు, మాజీ పలాస నియోజకవర్గ కన్వీనర్ రామానంద స్వామీజీ, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటు అప్పారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు వైశ్య రాజ్‌మోహన్‌రాజ్, టౌన్ ప్రధాన కార్యదర్శి బొండా శ్రీనివాసరావు, బీజేవైఎం టౌన్ అధ్యక్షుడు పొందర ఈశ్వరరావు, పలాస రూరల్ మండల ప్రధాన కార్యదర్శి పైడి సాయిరాం, ఓబీసీ మోర్చా నాయకులు బుర్జపేట హరికృష్ణ, అన్నారావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పుట్టగొడుగులు..లొట్టలేసుకుంటూ..!

- ఉద్దానంలో విరివిగా ల భించిన మొగ్గలు
- సేంద్రియ పుట్టగొడుగులపై జనం మక్కువ



**సోంపేట, ఆగస్టు 23 (వార్త):** ప్రస్తుతం వర్షాలు ఓ మోస్తారుగా కురవడంతో సహజంగా లభించే పుట్టగొడుగులు అనేకచోట్ల లభిస్తున్నాయి. ఆదివారం ఉదయం కవిటి ఉద్దానం ప్రాంతంలోని అనేక చోట్ల ప్రజలకు విరివిగా లభించి వారిలో మంచి ఉత్సాహాన్ని రేకెత్తించాయి. సహజంగా నేలపై లభించే పుట్టగొడుగులు మంచి రుచితో పాటు అనేక పోషక విలువలు కలిగి ఉంటాయ నడంలో సందేహం లేదు. దీన్ని మంచిగా వండి లొట్టలేసుకుంటూ తింటారు. ఇటువంటి ఆహారం ప్రతి ఏటా వర్షాలు బాగా కురిసే సమయంలో దసరాకు ముందు, తర్వాత అధికంగా లభిస్తోంది. ఈ సీజన్ కోసం ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. ఆదివారం కవిటి మండలం బొర్ర పుట్టుగ, శిలగం తదితర ప్రాంతాల్లో సహజమైన పుట్టగొడుగులను ప్రజలు పెద్ద మొత్తంలో సొంతం చేసుకున్నారు. లభించిన పుట్టగొడుగులు వారి బంధువులకు, స్నేహితులకు పంచిపెట్టగా వారి ఇళ్లల్లో కూర తయారు చేసుకుంటూ మంచి విందును ఆరగించారు. ముఖ్యంగా పుట్టగొడుగు మొగ్గలు మంచి రుచికరంగా తినడానికి ఎంతో ఇష్టంగా ఉంటాయి. దీనిపైన ప్రజలు ఎక్కువ మక్కువ చూపిస్తారు. ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తున్న ప్రజలకు ప్రస్తుత వర్షాలకు పుట్టగొడుగులు పేలడంతో ప్రజలు ఎంతో సరదా పడుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## నిరుపేదల సేవలో సాయిరాం భక్తులు



**కవిటి, ఆగస్టు 23 (వార్త):** రాజపురం గ్రామానికి చెందిన సత్యసాయి భజన మండలి భక్తులు సోమవారం నిరుపేదల సేవలో తరించారు. ఎంపిక చేసిన కుటుంబాలకు నెలకు సరిపడా కిరాణా సరుకులను అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ మేరకు ఒడిస్సా పాటి సున్నాపురం గ్రామంలో ఇద్దిలక్ష్మమ్మ, బల్ల ఎర్ర గోవింద పుట్టుక గ్రామంలో దూగాన చంద్రమ్మ, ఆర్.బల్లిపుట్టుగ గ్రామంలో ఎర్ర దమయంతి కుటుంబాలకు నెలకు సరిపడా బియ్యం, కిరాణా సరుకులను అందించారు. ఈ సందర్భంగా వారి ఇండ్ల వద్ద సత్య సాయి ప్రార్థన చేపట్టి ప్రసాదాన్ని కూడా అందించారు. ఈ భక్తుల సేవల పట్ల ఆయా గ్రామస్తులు అభినందించారు.

## చిన్న గెడ్డ కాజ్ వే నిర్మాణంపై చర్చలు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 24 (వార్త):** కేసుపురం సన్యాసిపుట్టుగ నీలాపుపుట్టుగ గ్రామంలో రైతులు కోసం చిన్నగెడ్డలో కాజ్ వే నిర్మాణం కోసం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బి అశోక్ లకు ఎపి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావు, పూర్వ ఎంపీపీ దక్కతఢిల్లీరావు వివరించారు. ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులు చిన్న గెడ్డ వద్ద కు చూసి ఆ కాజ్ వే నిర్మాణం నకు అంచనా విలువ 26 లక్షల రూపాయలు అంచనా వేసి ప్రభుత్వం నకు ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ బి అశోక్ ద్వార తీసుకొని వెళ్తామని చెప్పారు.నిర్ణయించిన ఈ పని విషయమై ఎ ఇ మధు సుధన పాణి గ్రహి చిన్న గెడ్డ వద్దకు చేరుకొని రైతు, నీటి వినియోగం దారుల సంఘం అధ్యక్షులు,తో చర్చించారు.మూడు గ్రామాల్లో నున్న రైతులు, నీటి వినియోగం దారుల సంఘం అధ్యక్షులు దక్కత కామేశ్వరరావురెడ్డి కామేశ్వరరావు, దక్కత ఢిల్లీ రావు , గుజ్జు భీమరాజు, పి. పురుషోత్తం, కె నరేంద్ర రెడ్డి, బి.శ్యామ్,ఎస్. కామరాజు, కె.జగ్గారావు,బి . తిరుపతి,జి.కుమారస్వామి, కృష్ణమూర్తి, కామరాజు, కర్రి ఉమాశంకర్, సంగారు బీమారావు, రైతులు పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం..
# బీఎల్వోలకు నోటీసులు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 24 (వార్త):** జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ , అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండా పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. గ్రామీణ ప్రాంతంలో బిర్లంగి, మండపల్లి, కీర్తిపురం కోలిగాం ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్లు 27, 28, 29, 9, 10, 11, 12, 20, 21 పోలింగ్ స్టేషన్లను, అలాగే పట్టణ ప్రాంతంలోని . 46, 53, 54 పోలింగ్ స్టేషన్లను సందర్శించారు.క్షేత్రస్థాయి పర్యటనలో కొన్ని లోపాలు గమనించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులందరికీ కఠినమైన ఆదేశాలు జారీ చేస్తూ, ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి 9గంటల వరకు అవసరమైన పత్రాలను సేకరించాలని సూచించారు. అనంతరం అధికారులు వెంటనే విచారణలు నిర్వహించి, పత్రాల నవీకరణ ప్రక్రియను ఎటువంటి ఆలస్యం లేకుండా ప్రారంభించాలని ఆదేశించారు.

ఏ ఈ ఆర్ వో లాగిన్‌లో గణనీయమైన పెండెన్సీ ఉన్న విషయాన్ని అన్ని ఏ ఈ ఆర్ వో లు గమనించాలని. విచారణలు నిర్వహించినప్పటికీ, సంబంధిత లాగిన్‌లో ఉన్న కేసులను క్లియర్ చేయడం లేదని అన్నారు., ఇప్పటికే విచారణలు పూర్తయిన కేసులను ముందుగా డిస్పోజ్ చేసి, లాగిన్‌లోని పెండెన్సీని పూర్తిగా క్లియర్ చేయాలని ఆదేశించారు. దీనివల్ల మొత్తం పనిలో గణనీయమైన పురోగతి సాధించవచ్చునని అన్నారు. సంబంధిత పత్రాలు విచారణకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను సిస్టమ్‌లో అప్‌లోడ్ చేసి, ఆమోదించిన తర్వాత మాత్రమే విచారణ పూర్తయినట్లు పరిగణించబడుతుందని ఆన్‌లైన్‌లో అవసరమైన నవీకరణను పూర్తి చేయకుండా కేవలం విచారణ నిర్వహించడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని అన్నారు. అందువల్ల, అన్ని బి ఎల్ ఓ లు సేకరించిన పత్రాలను వెంటనే సిస్టమ్‌లో అప్‌లోడ్ చేసి, మొత్తం ప్రక్రియను ఎటువంటి పెండెన్సీ లేకుండా పూర్తి చేయాలని ఈ సూచనలను సంబంధిత అధికారులు బి ఎల్ ఓ లందరూ కచ్చితంగా పాటించి, పనిలో గణనీయమైన పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించిన ముగ్గురు బి ఎల్ వో లకు మెమో లు జారీ చేశారు.

## కంబాలరాయుడుపేటలో నూతన హెల్త్ సెంటర్ ప్రారంభం

- రూ.20 లక్షల నరేగా నిధులతో నిర్మాణం
- పరిసర గ్రామాలకూ వైద్య సేవలు



**పలాస, ఆగస్టు 24(వార్త):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం కంబాలరాయుడుపేట గ్రామంలో నరేగా నిధులు రూ. 20 లక్షలతో నిర్మించిన నూతన హెల్త్ సెంటర్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నూతన హెల్త్ సెంటర్ అందుబాటులోకి రావడంతో కంబాలరాయుడుపేటతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, గోవింద పాపారావు, దానేష్, వాసు, రామారావు, డీఈతో పాటు స్థానిక నాయకులు, ప్రజలు, మహిళలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కారుమూరి అరెస్టు అక్రమం

- ఎమ్మెల్సీ నర్తు రామారావు



**కవిటి, ఆగస్టు 24(వార్త):** మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావును రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయించడం అక్రమమని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఖండించారు. ఆయన స్వగ్రామం కొత్త పుట్టుకలో తన నివాసం వద్ద సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఒక అక్రమ కేసును రూపొందించి దశలవారీగా అరెస్టులు పెట్టి ప్రజల్లో ప్రతిపక్ష వైసిపిని చులకన చేయాలన్న దుర్బుద్ధితో ఇటువంటి ప్రయత్నాలకు ఒడిగడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో మద్యం విధానం రూపు రేఖలు మార్చి ప్రభుత్వ సారథ్యంలో దుకాణాలు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించి అంతా పద్ధతిగా విక్రయాలు జరిపారని గుర్తు చేశారు. ప్రతి విషయంలోనూ పారదర్శకత పాటించిన గత ప్రభుత్వం పట్ల అక్రమంగా బురదజల్లేందుకు కూటమి ప్రభుత్వం అనేక కుట్రలు పొందుతుందని అన్నారు. రెండేళ్లుగా సాగుతున్న అక్రమ మద్యం కేసు సీరియల్ ఇప్పటికీ అంతం కాలేదని, ప్రభుత్వం పడిపోయే వరకు కూటమినేతలు ఇదే విధమైన చర్యలు చేపట్టడంలో ఏమాత్రం సందేహం లేదని అన్నారు. ఇప్పటివరకు సిట్ దర్యాప్తులో కొండను తవ్వి ఎలుకను పట్టిన చందమే తప్ప ఒరిగిందేమీ లేదని రామారావు పేర్కొన్నారు. రెండేళ్లకు పైగా పాలనలో ప్రతిపక్షాల పట్ల అక్రమ కేసులు, అరెస్టులు తప్ప ప్రభుత్వం సాధించిన అభివృద్ధి శూన్యమని అన్నారు. డీఎస్సీ పరీక్షలో తీవ్ర అక్రమాలు, అమరావతి భూముల్లో తీవ్ర అవినీతి ఇలా ఎన్నెన్నో వ్యవహారాలు కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగా ఇలాంటి తప్పుడు కేసులు పెడుతూ ప్రజల దృష్టి మళ్లించేందుకు ముఖ్యమంత్రి ఆపసోపాలు పడుతున్నారని విమర్శించారు. బీసీ నాయకులు పట్ల ప్రభుత్వం కక్షగట్టి లేనిపోని అక్రమ కేసుల్లో ఇరికించి ఇబ్బందులు పెట్టడం మినహా ఈ ముఖ్యమంత్రి కి మరో పనిలేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యువ నాయకుడు నర్తు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ హత్య కేసులో ..
# క్లూస్ టీమ్ విచారణ

- అనుమానితురాలైన మహిళా న్యాయవాది నివాసంలో క్షుణ్ణ పరిశీలన
- సీఐ ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆధారాల సేకరణ
- హత్య కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలపై పోలీసుల దృష్టి

**జలుమూరు, ఆగస్టు 24 (వార్త):** అల్లాడపేట గ్రామానికి చెందిన మహిళ హత్య కేసు దర్యాప్తులో భాగంగా అనుమానితురాలిగా ఉన్న మహిళా న్యాయవాది నివాసంలో సోమవారం క్లూస్ టీమ్ బృందం క్షుణ్ణంగా పరిశీలన నిర్వహించింది. సీఐ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్లూస్ టీమ్ సభ్యులు మహిళా న్యాయవాది నివాసంతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. హత్య కేసు దర్యాప్తుకు ఉపయోగపడే ఆధారాలు, ఇతర కీలక సమాచారాన్ని సేకరించే దిశగా ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు తెలిసింది. హత్య ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించేందుకు దర్యాప్తును ముమ్మరం చేశామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కేసులోని వివిధ కోణాలను పరిశీలిస్తూ, అందుబాటులో ఉన్న ఆధారాలను విశ్లేషిస్తున్నామని పేర్కొన్నారు. క్లూస్ టీమ్ సేకరించిన సమాచారం దర్యాప్తుకు ఉపయోగపడే అవకాశముందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు బి. గణేష్, అశోక్‌బాబు, క్లూస్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు. మహిళ హత్య కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు.



## భర్త మృతదేహానికి భార్యే తలకొరివి



**పలాస, ఆగస్టు 24(వార్త):** పలాసలో విషాద ఘటన సోమవారం చోటుచేసుకుంది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు కాపువీధికి చెందిన బెహరా లక్ష్మీనారాయణ (44) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో తల్లి, భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి రోదనలు స్థానికులను కలచివేశాయి. భర్త మృతదేహానికి భార్యే తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. లక్ష్మీనారాయణ మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. విషయం తెలిసిన స్థానికులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

## అధికారుల పని.. ప్రదీప్ చేశారు!

- కంచిలి ఆర్ అండ్ బి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

**కంచిలి, ఆగస్టు 24 (వార్త):** కంచిలి మెయిన్ రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. దశాబ్దాలుగా పునర్నిర్మాణం చేయకపోవడంతో తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టేయడంతో రోడ్డు ఎక్కడపడితే అక్కడ గుంతల మయమై ప్రజలకు తీవ్ర సమస్యగా మారింది. ఇటువంటి సమస్య పరిష్కారానికి ఆర్ అండ్ బి అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో విసుగెత్తిన ప్రజలు ఇటీవల ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ను కంచిలి ప్రజలు మెయిన్ రోడ్డు మీదన సమస్యను ఏకరువు పెట్టారు. తమరైనా దయ చూపాలని, అనేక సంవత్సరాలుగా రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదని, రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉందని వివరించారు. కాలువలు నిర్మాణం లేక వర్షం పడితే వరద నీరు రోడ్డుపైనే చెరువులను తలపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లో తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో టిడిపి యువ నాయకుడు మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు కుమారుడు మాదిన ప్రదీప్ గోతులు పూడ్చే పనిని తన భుజస్కందాలపై వేసుకున్నాడు. మెటీరియల్ తెప్పించి సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా కంచిలి మెయిన్ రోడ్డు పై నెలకొన్న గుంతలను పూర్తిగా కప్పించే ప్రయత్నం చేశాడు. ఆది, సోమవారాల్లో మెయిన్ రోడ్డు గుంతలు కప్పించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తాత్కాలికంగానైనా ఇటువంటి పనులు చేపట్టి గోతులు పూడ్చడం పట్ల ప్రదీప్ ప్రయత్నాన్ని అందరూ అభినందించారు. ఈ సందర్భంగా చాలా మంది శభాష్ ప్రదీప్ అంటూ అభినందించడం విశేషం.



## ఉర్లాం పాఠశాలను ఎంఈవో తనిఖీ

**నరసన్నపేట, ఆగస్టు 24(వార్త):** ఉర్లాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో పేడాడ దాలినాయుడు సోమవారం సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థుల సామర్థ్యాలు, వారి పురోగతి తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలపై ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాల్లో ఉన్న లోపాలను గుర్తించి, వాటిని మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు ప్రతిరోజు హోంవర్క్ తప్పనిసరిగా ఇవ్వాలని, వారు దానిని సక్రమంగా పూర్తి చేశారో లేదో ఉపాధ్యాయులు పరిశీలించాలని సూచించారు. హోంవర్క్ ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మరింత మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి విద్యా పురోగతిని ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని ఎంఈవో దాలినాయుడు సూచించారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పనిచేయాలని తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# 12 కిలోల గంజాయితో ఇద్దరు మహిళల అరెస్టు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 24(వార్త):** ఒడిశా నుంచి వెస్ట్ బెంగాల్ కు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు మహిళలను ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లో పట్టుకొని అరెస్ట్ చేసినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ మీసాల చిన్నమనాయుడు తెలిపారు.

సోమవారం విలేఖర్ల సమావేశంలో పట్టుబడిన గంజాయికి సంబందించిన వివరాలు వెల్లడించారు. పట్టణ ఎస్సై ఎమ్. ముకుందరావు సిబ్బందితో రైల్వేస్టేషన్లో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమాన స్పదంగా కనిపించిన ఇద్దరు మహిళలు వద్ద ఉన్న సూట్ కేసులను తనిఖీ చేయగా అందులో 12 కేజీల 520 గ్రాముల గంజాయిని గుర్తించి పట్టుకోవటం జరిగిందని తెలిపారు. వివరాల్లోకి వెళ్తే పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హౌరా జిల్లా శశిభూషన్ శంకర్షెన్ సల్కియా ఏరియాకు చెందిన పాయల్ పాల్(43), బల్లి దుర్గాపూర్ గ్రామం బల్లీ జగచ్ఛా పంచాయితీ సమబానియాపల్లికి పోస్ట్ కి మౌవ ఏరియాకు చెందిన మౌ మకల్ (అలియాస్ తనిషా)(43) ఈ ఇద్దరు మహిళలు ఆర్థిక పరిస్థితి బాగులేకపోవటంతో పాయల్ పాలకు పరిచయం ఉన్న గంజాయి వ్యాపారం చేసే సమీర్దాస్ అనే వ్యక్తి వద్దకు వెళ్లి వీరి ఆర్థిక ఇబ్బందులును తెలియజేసినట్లు చెప్పారు. సమీర్ చెప్పినట్లు గంజాయిని తీసుకొస్తే ప్రతీ మారు రూ10వేలు చొప్పన డబ్బు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకుని ఒప్పుకున్న ఈ ఇద్దరు మహిళలు గతంలో పశ్చిమ బెంగాళ్ రాష్ట్రం అటవీ ప్రాంతం కుచ్ బీహార్ నుండి పలుమార్లు గంజాయిని తీసుకొచ్చారు. ఈ మధ్య జరిగిన ఎన్నికల కారణంగా పోలీస్ తనిఖీలు ఎక్కువగా ఉండటంతో ఈసారి అక్కడ గంజాయి వ్యాపారం చేసే రంజిత్ కుమర్ సాహు వద్ద గంజాయిని కొనుగోలు చేశారని వీరంతా గంజాయి పట్టుకొని బస్సులో ఇచ్ఛాపురం చేరుకున్నారని . బస్టాండ్ నుంచి వెస్ట్ బెంగాళ్ రైలులో వెళ్లేందుకు ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ కి చేరుకున్నారని చెప్పారు.. పాయల్ పాల్, మహల్ ఇద్దరు స్టేషన్లో కూర్చొని ఉండగా సమీర్ టికెట్లు తీయటానికి వెల్లాడని, ఆ సమయంలో అనుమానస్పందంగా కనిపించిన ఇద్దరు మహిళలు వద్ద పట్టణ ఎస్సై ముకుందరావు తనిఖీలు చేపట్టగా గంజాయి పట్టుబడిందని సీఐ తెలిపారు. వీరి వద్ద ఉన్న గంజాయితోపాటు రెండు సెల్ఫోన్లు సీజ్ చేసి అరెస్ట్ చేశామని తెలిపారు. నిందితులను సోంపేట కోర్టు లో హాజరు పరచునున్నట్లు తెలిపారు.



## గణితంపై భయం విడనాడాలి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 24 (వార్త):** ఇచ్ఛాపురంలోని జ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో పాఠశాల కార్యదర్శి కార్యదర్శి , ముఖ్య కార్య నిర్వహణ అధికారి జోహార్ ఖాన్ అధ్యక్షతన అబాకస్,వేదిక్ మ్యాథ్స్ కోర్సుల ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి కె సూర్యరావు కోర్సుల పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లెక్కల సబ్జెక్టు పట్ల విద్యార్థులు భయాందోళనను విడాలని సూచించారు. మిగతా పాఠ్యాంశాలకు భిన్నంగా లెక్కల సబ్జెక్ట్ ఉంటుందని... ఈ సబ్జెక్టులో మెలకువలు తెలుసుకుంటే సునాయాసంగా ఎటువంటి లెక్కలు నైనా పరిపూర్ణంగా పూర్తి చేయగలుగుతామని అన్నారు. వేదిక్ మ్యాథ్స్, అబాకస్ లెక్కల పాఠ్యాంశంలో విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. వేదిక్ మ్యాథ్స్ లో సూత్రాల ద్వారా ఎంతటి పెద్ద సమస్య అయినా క్షణాల్లో పూర్తి చేయవచ్చునని చెబుతూ .... పలు ఉదాహరణలు విద్యార్థులకు వివరించారు. ఈ నూతన పద్ధతులను పాఠశాలలో ప్రవేశపెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్య నిర్వహణ అధికారి జోహార్ ఖాన్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో లెక్కల పాఠ్యాంశం పట్ల మరింత ఆసక్తిని, నైపుణ్యతను పెంపు చేసినందుకు వేదిక్ మాథ్స్, అబాకస్ పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. భారతదేశ పురాతన వేదాల నుంచి వేదిక్ మ్యాథ్స్ ను స్వామి భారతి కృష్ణ తీర్థజి ప్రపంచానికి అందించారని తెలిపారు. ఎటువంటి రాత లేకుండా 200 లెక్కలను సైతం ఐదు నిమిషాల్లో పూర్తి చేయగలగా సామర్థ్యాన్ని అబాకస్ నైపుణ్యం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, వేదిక్ మాథ్స్ ఉపాధ్యాయురాలు వనజాక్షి, లెక్కలు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పాడి అభివృద్ధికి రైతులు కృషి చేయాలి



**నరసన్నపేట, ఆగస్టు 24(వార్త):** పాడి సంపద అభివృద్ధిపై రైతులు ప్రత్యేక దృష్టి సారించి, ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా పాల ఉత్పత్తిని పెంచుకోవాలని పశువైద్యశాఖ అధికారి ఓంకార్ సూచించారు. నరసన్నపేట మండలం గొట్టిపల్లి పంచాయతీలో పాడి రైతులకు సోమవారం రెండు రోజులపాటు అభ్యసన శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పాడి పశువుల ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, సకాలంలో టీకాలు వేయించడం, పరిశుభ్రమైన వాతావరణంలో పశువుల పెంపకం వంటి అంశాల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సరైన నిర్వహణ పద్ధతులను పాటించడం ద్వారా పశువుల ఉత్పాదకత పెరిగి రైతులకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. పాడి పశువుల కొనుగోలు కోసం అర్హత కలిగిన రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు ఓంకార్ తెలిపారు. పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలనుకునే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలపై పూర్తి సమాచారం తెలుసుకుని వాటిని వినియోగించుకోవాలని సూచించారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాడి పశువుల నిర్వహణ, పాల ఉత్పత్తి పెంపుదల, వ్యాధుల నివారణ, పశువుల ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పాడి రంగం గ్రామీణ రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని, రైతులు శాస్త్రీయ పద్ధతులతో పశుపోషణ చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.

## యాదవ్ కులాలను ఒకటిగా గుర్తించాలి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 24 (వార్త):** అఖిలభారత యాదవ మహా సభ అద్వర్యం లో స్టేట్ ప్రెసిడెంట్ ఎస్. మహేశ్వరి సూచన మేరకు అఖిల భారత యాదవ మహా సభ విశాఖ జోన్ ( శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం ) ప్రెసిడెంట్ కోట రామారావు సోమవారం పి జి ఆర్ ఎస్ లో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ కి మెమరాండం అందజేశారు.వివరాల్లోకి వెళ్తే వచ్చే ఏడాది భారత ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జరుపనున్న కుల, జన గణనలో గొల్ల, కాడి గొల్ల, కటిక,కోణార్, గౌడే గంగిరెద్దుల, మందడి ఇలా పలు శాఖలుగా, పలు పేర్ల తో ఉన్న యాదవ జాతులను యాదవ్ గా గుర్తించాలని కోరారు. స్వాత్రంత్రశీ రాక ముందు 1931 లో మద్రాస్ ప్రెసిడెన్సి జీ వో నెంబర్ 5240 ద్వారా 29 శాఖలుగా ఉన్న యాదవ్ జాతులను యాదవ్ గా పరిగణలోకి తీసుకోవాలనీ కోరడం జరిగింది. మళ్ళీ ఇన్నాళ్లకు ఇన్నేళ్లకు వచ్చే ఏడాది జన గణన చేయాలనీ నిర్ణయం తీసుకున్న సందర్భం లో ఇదే అంశం పరిగణలోకి తీసుకున్న అఖల భారత యాదవ్ మహా సభ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కలెక్టర్ లకు వినతి పత్రాలను అందజేసారు . ఈ కార్యక్రమం లో యాదవ్ సేవ దళం వ్యవస్థాపకులు కాళ్ళ లోకానదం, బాలకృష్ణాపురం మాజీ సర్పంచ్ ప్రతినిధి బోరుభద్ర లోహిదాస్, కోట రామోజీ, సీతారాం. భీమారావు, నర్తు చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

## 'పీఎం విశ్వకర్మ' యోజన గొప్ప వరం

**శ్రీకాకుళం, ఆగస్టు 24 (వార్త):**సంప్రదాయ కులవృత్తులు, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల అభ్యున్నతి కోసం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రవేశపెట్టిన 'పీఎం విశ్వకర్మ యోజన' ఒక అద్భుతమైన పథకమని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. శ్రీకాకుళంలో నిర్వహించిన 'పీఎం విశ్వకర్మ' శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శిక్షణా సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జలుమూరులో ఓటర్ల జాబితా ప్రక్రియకు శ్రీకారం

- 40 పంచాయతీల్లో 358 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- మండల పరిధిలో 51,602 మంది ఓటర్ల నమోదు
- ఓటర్ల జాబితాపై అభ్యంతరాలకు ఈ నెల 26 వరకు అవకాశం



**జలుమూరు, ఆగస్టు 24 (వార్త):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఈ మేరకు ఓటర్ల జాబితాకు సంబంధించిన ప్రభుత్వ సర్క్యులర్ను మండలంలోని సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పరిశీలనార్థం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో చిన్నమ్మడు తెలిపారు. జలుమూరు మండల పరిధిలోని 40 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. మండల వ్యాప్తంగా మొత్తం 358 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఓటర్ల సంఖ్య, సౌకర్యాలు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అధికారులు కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితాలో ప్రస్తుతం 51,602 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు లేదా ఇతర సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, సూచనలు ఉన్న వారు ఈ నెల 26వ తేదీలోగా తెలియజేయాలని కోరారు. నిర్ణీత గడువు అనంతరం అందే అభ్యంతరాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని, ప్రజలు తమ ఓటరు వివరాలను ముందుగానే పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు.

## రోడ్లపై పశువులను విడిచిపెట్టొద్దు

- రోడ్లపై కనిపిస్తే బంజర శాలలో బంధిస్తామని ఈవో హెచ్చరిక
- పశువుల యజమానులకు అపరాధ రుసుము విధించే అవకాశం
- నాయుడు వీధిలోని బంజర శాలను పరిశీలించిన ఈవో జగన్మోహనరావు



**నరసన్నపేట, ఆగస్టు 24(వార్త):** నరసన్నపేట పట్టణంలో పశువులను విచ్చలవిడిగా రోడ్లపై విడిచిపెట్టవద్దని మేజర్ పంచాయతీ ఈవో జగన్మోహనరావు పశువుల యజమానులకు విజ్ఞప్తి చేశారు. రహదారులపై సంచరిస్తున్న పశువుల కారణంగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో పశువులు కనిపిస్తే వాటిని పట్టుకుని బంజరసాలలో బంధిస్తామని ఆయన హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించి పదేపదే పశువులను రోడ్లపైకి వదిలే యజమానులపై అపరాధ రుసుము విధించనున్నట్లు తెలిపారు. పశువుల యజమానులు బాధ్యతగా వ్యవహరించి మేజర్ పంచాయతీ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని నాయుడు వీధిలో ఉన్న బంజరసాలను ఈవో జగన్మోహనరావు సోమవారం పరిశీలించారు. అక్కడి సౌకర్యాలు, పశువులను బంధించే ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోడ్లపై స్వేచ్ఛగా తిరుగుతున్న పశువులను గుర్తించి వెంటనే బంజరసాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలో రహదారి భద్రత, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పశువుల సంచారంపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు ఆయన తెలిపారు. పశువుల యజమానులు స్వచ్ఛందంగా సహకరించి పశువులను రోడ్లపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## దేశవానిపేట పాఠశాలలో వేధింపుల ఆరోపణలపై విచారణ

- ముగ్గురు మహిళా ఉపాధ్యాయుల ఫిర్యాదుపై డిప్యూటీ డీఈవో విచారణ
- పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల నుంచి వివరాల సేకరణ
- రెండు రోజుల్లో డీఈవోకు విచారణ నివేదిక సమర్పిస్తామని వెల్లడి

**నరసన్నపేట, ఆగస్టు 24(వార్త):** దేశవానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిపై వేధింపుల ఆరోపణలకు సంబంధించి ముగ్గురు మహిళా ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో)కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు డిప్యూటీ డీఈవో విజయ్కుమారి తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణలో భాగంగా సోమవారం పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డీఈవో విజయ్కుమారి, అక్కడి ఉపాధ్యాయులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై సంబంధిత ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి వాదనలు, అభిప్రాయాలను నమోదు చేసినట్లు తెలిసింది. పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై సమగ్రంగా ఆరా తీసినట్లు సమాచారం. మహిళా ఉపాధ్యాయులు చేసిన ఫిర్యాదుతో పాటు పాఠశాల పరిపాలన, అక్కడి ఉపాధ్యాయుల అభిప్రాయాలను పరిశీలించి పూర్తి స్థాయి విచారణ నివేదికను సిద్ధం చేయనున్నట్లు విజయ్కుమారి తెలిపారు. విచారణలో సేకరించిన వివరాల ఆధారంగా రెండు రోజుల్లో నివేదికను డీఈవోకు సమర్పిస్తామని పేర్కొన్నారు. డీఈవోకు నివేదిక అందిన అనంతరం ఉన్నతాధికారులు తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఈ విచారణలో సంబంధిత ఎంఈవోలు కూడా పాల్గొన్నారు.



## మూడేళ్లకే మూలకు రైతు భరోసా కేంద్రం

- దేశవానిపేటలో రూ.21.80 లక్షలతో నిర్మించిన కేంద్రం రద్దు
- వెయ్యి మందికంటే తక్కువ మంది రైతులుండడమే కారణం
- ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరే పరిస్థితి



**నరసన్నపేట, ఆగస్టు 24(వార్త):** రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సేవలు, సలహాలు ఒకేచోట అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో నరసన్నపేట మండలం దేశవానిపేటలో రూ.21.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం మూడేళ్లకే మూలకు చేరింది. వెయ్యి మంది కంటే తక్కువ మంది రైతులు ఉన్నారనే కారణంతో ఈ కేంద్రాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతో భవిష్యత్తులో భవనం వినియోగంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంటల సాగుపై సాంకేతిక సలహాలు తదితర సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో దేశవానిపేటలో ఆధునిక సదుపాయాలతో కేంద్రాన్ని నిర్మించేందుకు రూ.21.80 లక్షల ప్రభుత్వ నిధులను వెచ్చించారు. అయితే కేంద్రం ప్రారంభమైన మూడు సంవత్సరాలకే రైతుల సంఖ్య వెయ్యి మందికి తక్కువగా ఉందనే కారణంతో దానిని రద్దు చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్రాన్ని రద్దు చేసిన తర్వాత భవనం వినియోగం లేకపోవడంతో క్రమంగా నిరుపయోగంగా మారే పరిస్థితి ఏర్పడింది. ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాన్ని మూసివేయడం కంటే, దానిని వ్యవసాయం లేదా ఇతర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవాలని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన కార్యాలయంగా, రైతులకు అవగాహన కార్యక్రమాల కేంద్రంగా లేదా ఇతర ప్రభుత్వ సేవలకు ఉపయోగిస్తే ప్రభుత్వ నిధులు వృథా కాకుండా ఉంటాయని సూచిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ భవనానికి ప్రత్యామ్నాయ వినియోగాన్ని నిర్ణయించి, నిరుపయోగంగా పడి శిథిలావస్థకు చేరకుండా చర్యలు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేయకుంటే ఉద్యమం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 24 (వార్త):** తాడేపల్లి వైస్సార్సీపీ కేంద్ర కార్యాలయం ఆధ్వర్యంలో విజయవాడ లో జరిగిన కార్యక్రమం లో వెన్నుపోటు పార్టీ పై వంచన బి సి గర్జన పై సమావేశంలో వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. వెన్నుపోటు పార్టీ (టీడీపీ) వెనుకబడిన సామజిక వర్గాలకు చేసిన వంచన పై జరిగిన చర్చ కార్యక్రమంలో బి. సి నాయకులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కూటమి ప్రభుత్వంలో బిసి లకు జరిగిన అన్యాయం పై సుదీర్ఘ చర్చ జరిగింది, విద్య, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాలలో బిసి ల వెనుకబాటుకు గల కారణాలు, రాష్ట్రంలో బిసి నాయకులపై జరుగుతున్న దాడులు, కేసులు పై నాయకులు చర్చించడం జరిగింది, కూటమి ప్రభుత్వం తీసుకొని వచ్చిన జీవో 105 ప్రకారం బిసి లకు 34 శాతం రిజర్వేషన్ అమలు వెంటనే చేయాలని అమలు చేయని పక్షంలో యావత్తు బిసి సామజిక వర్గాలను ఏకం చేసి బిసి ల సత్తా చాటే విదంగా భవిష్యత్తు కార్యాచరణ రోడ్ మ్యాప్ తయారు చేసి పార్టీ అదినాయకుని దృష్టిలోకి తీసుకొని వెళ్లి త్వరలో జోన్, జిల్లా ,నియోజకవర్గ, మండలం స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించే దిశగా అడుగులు. వేస్తామని చెప్పారు.

## గోవర్ధనపురంలో ఇంటింటికీ తెలుగుదేశం

- ప్రతి ఇంటిని సందర్శించి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన
- గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్న ధర్మాన తేజ్కుమార్
- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి

**సారవకోట, ఆగస్టు 24 (వార్త):** గోవర్ధనపురం గ్రామంలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సారవకోట మండల తెలుగుదేశం పార్టీ రథసారథి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్కుమార్ పాల్గొని గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను గ్రామస్తులకు తెలియజేస్తూ, ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను గౌరవ నరసన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్థాయి సమస్యలపై నేరుగా ప్రజల నుంచి సమాచారం సేకరించడం ద్వారా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవచ్చని ధర్మాన తేజ్కుమార్ పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం, నాయకత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, జలుమూరు మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు డొక్క వెంకటరమణ, స్థానిక నాయకులు లుకలాపు నారాయణరావు, ఎన్ని రాజు, లుకలాపు సురేష్, యూనిట్ ఇన్ఛార్జి ఇసై నాగరాజు, పెద్దలంబ గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకుడు డోలా శ్రీను, చిన్నగుజ్జువాడ గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకుడు జమానా నీలయ్య, బాణాల ప్రసాద్, కిరణ్తో పాటు గోవర్ధనపురం గ్రామ పంచాయతీ కూటమి కార్యకర్తలు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546